క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ అంజయ్య

లింగాపూర్: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని సీఐ అంజయ్య అన్నారు. బుధవారం మండలంలోని గీతాబండ గ్రామాన్ని ఆయన సందర్శించారు. లోక్‌సభ ఎన్నికలు ఉన్నందున అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని వంజారిగూడ, పిక్లాతండా, మామిడిపల్లి గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ సీఐ భద్రిప్రసాద్, లింగాపూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ క్యాన్‌ల పంపిణీ



వాటర్ క్యాన్‌లు అందజేస్తున్న ఎంపీడీవో

దహెగాం: వేసవి దృష్ట్యా ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కూలీలకు కూలింగ్ వాటర్ క్యాన్‌లు అందజేసినట్లు ఎంపీడీవో రాజేందర్ అన్నారు. బుధవారం దహెగాం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన వాటర్ క్యాన్‌లను అందించారు. ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రత ఉన్నందున కూలీలకు పని ప్రదేశంలో నీడ, తాగు నీరు, ఫస్ట్ ఎయిడ్ తదితర సౌకర్యాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ ఆత్మారాం, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

దహెగాం: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 6న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కంబగొని సులోచన అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



విద్యార్థితో బోర్డుపై రాయిస్తున్న పురుషోత్తం

కెరమెరి: ఈ నెల 8 నుంచి ప్రారంభంకానున్న ఎస్‌ఏ -2 పరీక్షల కోసం విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఏటీడీవో పురుషోత్తం అన్నారు. బుధవారం ఆయన మండలంలో బాబేఝరి, జోడేఘాట్ ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు చదివించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్‌ఎంలకు సూచించారు. హెచ్‌ఎంలు జంగు, ఆత్రం మోతీరాం ఉన్నారు.

'ఉపాధి' పనులు పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం గ్రామంలో ఉపాధిహామీ పథకంలో కొనసాగుతున్న పనులను బుధవారం ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు సిబ్బంది తప్పనిసరిగా పని కల్పించాలన్నారు. పనుల ప్రదేశంలో వేసవి దృష్ట్యా తాగు నీరు, నీడ తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు శివకృష్ణ, మౌనిక, లక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ జయంతి విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్అర్బన్: ఈనెల 5వ తేదీన జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌రాం విగ్రహ ప్రాంగణం వద్ద మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే భారత మాజీ ఉప ప్రధాని, దళిత నేత బాబు జగ్జీవన్‌రాం జయంతిని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రేగుంట కేశవ్‌రావ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జయంతి వేడుకలకు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, కుల, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మొక్కల సంరక్షణపై పట్టింపేది?



పార్వతిపేట శివారులో ఎండిపోయిన మొక్క

- ఎండిపోతున్న మొక్కలు
- పట్టించుకోని అధికారులు

దహెగాం: పచ్చదనం, అడవుల విస్తీర్ణం పెంచాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమం తీసుకొచ్చింది. హరితహారం కార్యక్రమంలో భాగంగా అధికారులు ప్రతీ గ్రామ పంచాయతీలో వన నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచారు. పెంచిన మొక్కలను గ్రామాల్లోని రోడ్లకిరువైపులా నాటారు. కానీ నాటిన మొక్కలకు నీరు పోయడం లేదు. దీంతో మొక్కలు ఎండిపోతున్నాయి. పొలాల గట్లపై పెట్టిన మొక్కలు సైతం వాడిపోతున్నాయి. పొలాల్లో చెత్తను గట్ల వద్ద జమ చేసి నిప్పు పెట్టడం వల్ల మంటలకు మొక్కలు, చెట్లు కాలిపోతున్నాయి. దీంతో నాటిన మొక్కల సంరక్షణపై అధికారుల పట్టింపేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

'హరితహారం' సమయంలోనే హడావుడి..

ప్రతీ సంవత్సరం హరితహారం కార్యక్రమం జూన్, జూలైలో నిర్వహిస్తుంటారు. ప్రభుత్వ అధికారులు ఆ సమయంలో హడావుడి చేసి తర్వాత పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజలకు పచ్చని వాతావరణంతో పాటు ఆహ్లాదాన్ని పంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు కొత్త కార్యక్రమాలు తీసుకొస్తున్నా కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయం నీరుగారి పోతుంది. మొక్కలను సంరక్షించడానికి ప్రతీ గ్రామ పంచాయతీకి వాటర్ ట్యాంకర్ కూడా ఉంది. పంచాయతీ సిబ్బంది ట్యాంకుల ద్వారా నీటిని మొక్కలకు పోయాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.



ట్రీగార్డు లేకుండా నిర్లక్ష్యంగా వదిలేసిన మొక్క

3 లక్షల మొక్కలు..

మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామ పంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేశారు. నర్సరీల్లో వివిధ రకాల మొక్కలను పెంచుతున్నారు. మండలంలో ప్రతీ సంవత్సరం 3 నుంచి 4 లక్షల మొక్కలను నాటుతున్నారు. నర్సరీలలో మొక్కలు పెంచడం, మొక్కలు నాటడానికి ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా నాటిన మొక్కలను మాత్రం సంరక్షించకపోవడంతో లక్షల రూపాయలు వృధా అవుతున్నాయని వాపోతున్నారు. నాటిన మొక్కలకు ట్రీ గార్డులు సైతం ఏర్పాటు చేయకపోవడంతో పశువులకు మేతగా మారుతున్నాయి.

పట్టించుకోని ప్రత్యేకాధికారులు..

పంచాయతీలలో సర్పంచుల కాలం ముగిసి రెండు నెలలు కావస్తుంది. పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రత్యేకాధికారులు రోజువారి విధులు నిర్వహించడంతో పాటు పంచాయతీ పనులు చూడాల్సి వస్తున్నందున పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించడం లేదు. పంచాయతీలకు ట్రాక్టర్లు ఉన్నా అవి నిరుపయోగంగా మారాయి. అసలే ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. మొక్కలకు నీరు పట్టకుంటే అవి పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్యాంకర్ల ద్వారా నాటిన మొక్కలకు నీరు పట్టి మొక్కలను సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన భీమ్‌దీక్ష యాత్ర



బుద్ధ విహార్‌లో పూజలు చేస్తున్న దీక్షాపరులు

కౌటాల: మండల కేంద్రంలోని బుద్ధ విహార్ నుంచి మండలంలోని తలోడి, సదాశివపేట్, యాపలగూడ, బోదంపల్లి గ్రామాల్లో భీమ్ దీక్షాపరులు భీమ్‌దీక్ష యాత్ర నిర్వహించారు. అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని భారత రాజ్యాంగ అవగాహన సదస్సులో భాగంగా భీమ్‌దీక్ష యాత్ర నిర్వహించారు. బౌద్ధ సమాజ్ సంఘం సిర్పూర్ తాలుకా అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ మాట్లాడుతూ గౌతమ బుద్ధుడు బోధించిన బోధనలను పాటించాలని తెలిపారు. కౌటాల బుద్ధ విహార్‌లో దీక్షాపరులు ప్రత్యేక పూజలు చేశారు. మహార్ సంఘం నాయకులు అశోక్, కిశోర్, పత్రు, విఠల్, రాందాస్, జానకీరాం, చరందాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా విరమణ



కార్మికులతో చర్చిస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్‌రూరల్: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టిన మున్సిపల్ కార్మికులు బుధవారం ధర్నా విరమించారు. గత మూడు నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా వారు ధర్నా చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ షహీన్‌సుల్తానా, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగీర్, మున్సిపల్‌కమిషనర్ అంజయ్య కార్మికులతో చర్చలు జరిపారు. ఒక నెల వేతనాన్ని చెల్లించేందుకు అంగీకరించడంతో కార్మికులు ధర్నా విరమించారు. మిగితా నెలల వేతనాలను కూడా త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

చిరు వ్యాపారులకు ఉచితంగా గొడుగులు పంపిణీ



గొడుగులు అందజేస్తున్న మిల్లు అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్ మార్కెట్, అంబేద్కర్ చౌరస్తాలోని చిరువ్యాపారులకు బుధవారం స్పర్శ ఫౌండేషన్, ఎస్పీఎం ఆధ్వర్యంలో ఉచితంగా గొడుగులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మిల్లు వైస్ ప్రెసిడెంట్ మిశ్రా, జనరల్‌మేనేజర్ ఎంఎస్ గిరి మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఉచితంగా గొడుగులు అందజేసినట్లు తెలిపారు. మిల్లు జీఎం (సివిల్) గిరీశ్‌రాయ్, సీనియర్ మేనేజర్ రమేశ్ రావు, ప్రతినిధి తుమ్మ రమేశ్, స్పర్శ ఫౌండేషన్ మేనేజర్ రీనా బివాల్, అశోక్, సుందరం, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కరెంటు పోతే ఇంధనం బంద్



పెట్రోల్ కోసం పడిగాపులు కాస్తున్న వినియోగదారులు

- పని చేయని సోలార్ ప్యానెల్స్
- నాలుగేళ్లుగా ఇదే తంతు
- పట్టించుకోని అధికారులు

కెరమెరి: ఐటీడీఏ, జీసీసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కెరమెరి, జైనూర్, తిర్యాణి మండల కేంద్రాల్లోని డీజిల్, పెట్రోల్ బంకులు కరెంట్ పోతే పని చేయని పరిస్థితి నెలకొంది. విద్యుత్ సరఫరా నిలిచిపోతే వినియోగదారులు పెట్రోల్ కోసం బంక్‌ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఆయా బంకుల్లో ఏర్పాటు చేసిన సోలార్ సిస్టంలు నిరుపయోగంగా మారాయి. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతుండడంతో పాటు పెద్దమొత్తంలో బంకులకు ఆర్థిక నష్టం కలుగుతుంది.

రోజుకు రూ.5 లక్షల వరకు గిరాకీ

కెరమెరి మండల కేంద్రంలో ఉన్న పెట్రోల్ బంక్‌లో రోజుకు సుమారు రూ.4.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు గిరాకీ అవుతుంది. అంటే ఒక్కరోజు విద్యుత్ సరఫరా నిలిచిపోతే రూ. 5 లక్షల వరకు నష్టం వస్తుంది. మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా 156 గ్రామాలు ఉన్నాయి. వ్యవసాయాధారిత మండలం కనుక యంత్రాలతో విరివిగా పొలం పనులు చేస్తున్నారు. ప్రతీరోజు పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లు, మోటార్ బైక్‌లు, ఆటోలు ఇతర వాహనాలు ఇంధనం కోసం బంకుకు వస్తుంటాయి. కానీ విద్యుత్ సరఫరా నిలిచిపోయిన రోజు పెద్ద మొత్తంలో బంక్ ఆదాయం కోల్పోతుండగా, వినియోగదారులు తీవ్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. కాగా బంకులో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాల్లో ఒకటి మాత్రమే పని చేస్తుంది. వాహనాల టైర్లలో గాలి నింపే యంత్రం ప్రారంభం నుంచి అలంకారప్రాయంగా ఉంది. అధికారులు స్పందించి సోలార్ సిస్టంకు మరమ్మతులు చేయాలని, లేదా జనరేటర్ ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. ఆసిఫాబాద్ జీసీసీ మేనేజర్ పాపారావును వివరణ కోరగా సోలార్ సిస్టం పని చేయడం లేదని, జనరేటర్ మంజూరుకు అనుమతి ఇవ్వాలని ఉన్నతాధికారులను కోరినట్లు పేర్కొన్నారు. త్వరలో జనరేటర్ సౌకర్యం కల్పించి వినియోగదారులకు 24 గంటలు బంక్ అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు.



పనిచేయని సోలార్ ప్యానెల్స్

ఇబ్బంది అవుతుంది..



కెరమెరిలో ఒకటే పెట్రోల్ బంక్ ఉంది. కరెంటు పోయినప్పుడల్లా బంక్ పనిచేయడం లేదు. దీంతో చాలా ఇబ్బంది అవుతుంది. అధికారులు స్పందించి ఇంధనం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- షేక్ సిరాజ్, కెరమెరి

పీటీఆర్ బిగింపు



పీటీఆర్‌ను బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

కెరమెరి: గత నెలలో మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఒక నూతన పీటీఆర్ (పవర్ ట్రాన్స్‌ఫార్మర్)ను బిగించగా బుధవారం మరో 5.0 ఎంవీఏ పీటీఆర్ బిగించారు. దీంతో ఇక నుంచి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండదని విద్యుత్ డీఈ వెంకటేశ్వర్లు, డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. గతంలో ఉన్న లోడుకు, ప్రస్తుతం ఉన్న లోడుకు చాలా వ్యత్యాసం ఉందని, గృహోపయోగ, వ్యాపార, వ్యవసాయ విద్యుత్ మీటర్లు పెరిగాయని దీన్ని దృష్టిలో పెట్టుకొని నూతన పీటీఆర్‌ను బిగించామన్నారు. ఎల్ఐ రాజశేఖర్, ఆలమ్, విద్యుత్ సిబ్బంది మారుతి, రవి తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

రెబ్బెన: మండలంలోని రాంపూర్ గ్రామానికి ఏర్పాటు చేస్తున్న బీటీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం డిమాండ్ చేశారు. బుధవారం బీటీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా పనులు నత్తనడకన కొనసాగుతున్నాయన్నారు. నిర్మాణ పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవటంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారని ఆరోపించారు. డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు శివ, మండల ఉపాధ్యక్షుడు క్రిష్ణ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో బుధవారం బాలభారతి ఉన్నత పాఠశాల 1996–97 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, మున్సిపల్ కమిషనర్ అంజయ్య ప్రారంభించారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

సుర్దాపూర్ నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణారావు

కెరమెరి: మండలంలోని సుర్దాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీని బుధవారం ఎంపీడీవో కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు రోజుకు మూడుసార్లు నీళ్లు పట్టాలన్నారు. పిచ్చిమొక్కలు మొలకెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. చిన్నారులతో గేయాలు పాడించారు. ఇటీవల స్లాబ్ వేసిన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న భాస్కర్ మహరాజ్

జైనూర్: ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని హరిభక్త పారాయణ్ భాస్కర్ మహరాజ్ అన్నారు. బుధవారం మండలంలోని జామిని గ్రామంలో సప్తాహ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు దేశభక్తితో పాటు దైవభక్తిలో ముందుంటారన్నారు. గత 7 రోజులుగా అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో భాగంగా రాత్రింబవళ్లు హరినామ స్మరణ చేపట్టారని పేర్కొన్నారు. ప్రజలు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలనే ఉద్దేశంతో సప్తాహ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'పాల్వాయి'కి నేతల పరామర్శ



నివాళులర్పిస్తున్న గోడెం నగేశ్ తదితరులు

కాగజ్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు నానమ్మ అండాలమ్మ ఇటీవల మృతిచెందగా బుధవారం పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీలో గల ఎమ్మెల్యే నివాసంలో దశదిన కర్మ నిర్వహించారు. ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడెం నగేశ్, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్‌లు అండాలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యేను పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సఖీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: సఖీ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సఖీ కేంద్రం నిర్వాహకురాలు నాగమణి అన్నారు. బుధవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పొచ్చర గ్రామ శివారులో ఉపాధిహామీ పనులకు వెళ్లిన మహిళలతో మాట్లాడారు. సఖీ కేంద్రం ఆధ్వర్యంలో కౌన్సెలింగ్, న్యాయ, పోలీస్ సహాయంతో పాటు వైద్య సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. మహిళలు వారికి ఉన్న చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గృహహింస, బాల్యవివాహాలు, పోక్సో చట్టం, సైబర్‌క్రైం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ లచ్చరెడ్డి, కూలీ పాల్గొన్నారు.

ఆలయం చుట్టూ కంచె ఏర్పాటు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయం చుట్టూ బుధవారం గోండ్‌గూడ ఆదివాసీలు కంచె ఏర్పాటు చేశారు. త్వరలో నిర్వహించే చైత్రి మాసం పూజలకు ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీలు తరలిరానున్నారు. దీంతో కంచె ఏర్పాటు చేసినట్లు ఆలయ మహరాజ్ చహకటి సూర్యరావ్ తెలిపారు. కంచె ఏర్పాటు చేయడం ద్వారా తమకు దారి లేదని, రాకపోకలు ఎలా సాగించాలని గ్రామపటేల్ మారుతి డోంగ్రెతో పాటు గ్రామ పంచాయతీ ఈవో సంజీవ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ కమిటీ పెద్దలతో మాట్లాడి దారి ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గోండ్‌గూడ గ్రామ పెద్దలు మడావి ఇంద్రు, చహకటి నాగోరావ్, మెస్రం మహాదు పాల్గొన్నారు.

ఓంకార ఆశ్రమంలో భక్తిశ్రద్ధలతో పూజలు

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి ఓంకార ఆశ్రమంలో రాధాకృష్ణుల విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉత్సవాలలో భాగంగా రెండోరోజు విగ్రహాలకు పూజలు చేశారు. ఉత్సవాలకు హాజరైన కరీంనగర్ గాగిల్లాపూర్ పీఠాధిపతి శ్రీవిష్ణు సేవానందగిరి స్వామి, కోరుట్ల జగదీశ్వర ఆశ్రమం నుంచి జగదీశ్వరానందగిరి స్వామి, విశాఖ పట్నం శివానంద ఆశ్రమం పీఠాధిపతి విష్ణు దేవానందగిరి స్వాములు పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు.



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



రాధాకృష్ణుల విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్నసీఐ శంకరయ్య

కాగజ్‌నగర్‌రూరల్: దహెగాం మండలం బీబ్రా గ్రామానికి చెందిన ఎస్‌కే ఆస్మా బుధవారం పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద ఆటోలో వెళ్తుండగా తన సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. ఈ విషయాన్ని పట్టణ సీఐ శంకరయ్య దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన సీఐ, బ్లూకోర్ట్ సిబ్బందిని పంపించి సెల్‌ఫోన్‌ను ట్రేస్ చేసి బాధితురాలికి అప్పగించారు.